## క్లుప్తంగా

### కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందించాలి



ఉంగుటూరులో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఉంగుటూరు: వ్యవసాయ సీజన్ వచ్చే సరికి కౌలురైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఉంగుటూరు పంచాయతీ సామాజిక భవనంలో ఏపీ రైతు సంఘం, కౌలు రైతు సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు రైతు సమస్యలపై చర్చించారు. ఈమేరకు తీర్మానాలు చేశారు. జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీఆమ చంద్రమూర్తి పాల్గొన్నారు.

### చెస్‌పై పట్టు సాధించాలి

భీమడోలు: మేధోస్సును పెంచే చెస్‌పై పట్టు సాధిస్తే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలులోని కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా చదరంగంపై చిన్నారులకు శిక్షణ అందిస్తున్నారు. ఆ ఆట నిర్వహణ తీరును శనివారం ఆమె పరిశీలించారు. చిన్నారులతో ఆమె చెస్ ఆడారు. చెస్ ఆడే తరుణంలో మెలకువలను సీనియర్ కోచ్ పాలూరి కిరణ్‌కుమార్, శ్యామల వివరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో చెస్ నేర్చుకోవడం ద్వారా తమ మేధస్సుకు మరింత పదును పెట్టేందుకు దోహద పడుతుందన్నారు. కోచ్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ ఆదివారం ఏలూరు జిల్లా అండర్ 19 ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న పోటీల్లో ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ డైరెక్టర్ ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ బెనర్జీలు, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సుపరిపాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

భీమడోలు: భారతదేశానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ సేవలు అభినందనీయమని రాష్ట్ర పార్టీ ఉపా. ధ్యక్షురాలు శరణాల మాలతీరాణి అన్నారు. భీమడోలు బీజేపీ కార్యాలయంలో నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్నందుకు శనివారం బీజేపీ శ్రేణులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు టి.మాలతీరాణి, నియోజకవర్గ ఇన్‌చార్జి కాకిలేటి వెంకటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజలందరికీ సుపరిపాలను అందిస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారు. మహిళా ఆర్థికాభివృద్ధి, ఆరోగ్యం, సమాన హక్కు కోసం మోదీ చేపట్టిన పథకాలు సత్ఫలితాలిస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే భారతదేశాన్ని విశ్వ గురువుగా గుర్తింపు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షుడు అడపా శోభారాణి, మండల ఉపాధ్యక్షురాలు మిద్దే రమాదేవి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మామిడి కృష్ణకుమారి పాల్గొన్నారు.

### రమాబాయి సేవలు మరువలేనివి

ఏలూరు రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమని మాత రమాబాయి సేవలు మరువలేనివని మెండెం సంతోష్‌కుమార్ అన్నారు. శనివారం ఏలూరులో మాత రమాబాయి 85 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఉన్నత చదువుల కోసం రమాబాయి ఎంతో కృషి చేసిందని గుర్తుచేశారు. ముగ్గురు పిల్లలను పెంచుతూ దేశం కోసం రమాబాయి భర్తను ఉన్నత చదువుల కోసం విదేశాలకు పంపించారని వివరించారు. నేడు దేశంలో మహిళలు విద్యావంతులై, ఉన్నతంగా జీవించడానికి రమాబాయి చేసిన కృషి ఎంతో ఉందని చెప్పారు. భర్త విజయంలో కీలకభూమిక వహించిన రమాబాయి మహిళల్లో స్ఫూర్తి నింపారని కొనియాడారు. తొలుత పారబండ బాబురావు, డేవిడ్, ఏసు నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆధునిక సమాజాన్ని కంప్యూటర్లు శాసిస్తున్నాయని, విద్యార్థి దశ నుంచే కంప్యూటర్లపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్‌పర్సన్ ఏవీ రాజేష్ సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఆయన విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయుడు కె.శ్యామ్ సుందర్ గణితంలో సంక్షిప్త, అంక గణితాలను క్లుప్తంగా వివరించారు. బ్యాంక్ ఉద్యోగి ఫణీంద్ర సాయి కుమార్ క్విజ్ పోటీ నిర్వహించారు. ఉప గ్రంథపాలకుడు ఎ.నారాయణ రావు పాల్గొన్నారు.

# సీఎం జగన్ సంక్షేమ పాలనకు ప్రజాదరణ

- ప్రతీ గడపలో చిరునవ్వు, సంతృప్తి పథకాల లక్ష్యం
- గాలాయగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

దెందులూరు: ప్రతి గడపలో కుటుంబ సభ్యులందరి చిరునవ్వు, సంతృప్తి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజాదరణ పొందారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే బాధ్యతాయుతంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. శనివారం గాలాయగూడెంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, ఎంపీటీసీ సొంగా ప్రమీలారాణి, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైద్యం, ఇంటి స్థలం, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్, రుణాలు, ఇతర సమస్యలకు సంబంధించి వినతులను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వివరించారు. సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.



గాలాయగూడెం బీసీ ఏరియాలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

**పేదల అభివృద్ధి, సంక్షేమం విస్మరించిన టీడీపీ**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం విస్మరించారన్నారు. దీంతో ప్రజలందరి జీవనవిధానం దుర్భరంగా మారిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా పేదలు నివసించేందుకు స్థలం పట్టా, ఇంటి నిర్మాణానికి రుణం పారదర్శకంగా రాష్ట్ర వ్యాప్తంగా మహాయజ్ఞంలా అందజేశారన్నారు. నాలుగేళ్లల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను టీడీపీ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారానికి పూనుకున్నారన్నారు. నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక, ఆలోచనా విధానం, ఇచ్చిన హామీలు అమలు చేయడంతో ప్రజలందరికీ భరోసా కల్పించే నాయకుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ మరోసారి సీఎంగా కావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలు, విప్లవాత్మకంగా సత్ఫలితాలు ఇవ్వడంతో టీడీపీ నాయకులు ఏ రోజు ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు.

**అంకితభావంతో కృషి చేయాలి**

వైఎస్సార్ సీపీ అజెండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి పథకాలు తారతమ్యం లేకుండా అందజేయడం, ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ తరహాలో పెద్ద ఎత్తున ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి అహర్నిశలు బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి శ్రమిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. స్పందన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల ఉద్యోగులు అంకితభావంతో కృషి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందడం, సమస్యలుంటే పరిష్కరించడమే ఉద్యోగులందరి ఏకైక అజెండాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, సానిగూడెం సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, పార్టీ నాయకులు బోయపాటి గణేష్, ముసునూరి వెంకటేశ్వరరావు, తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, మరీదు రాజా, వాలంటీర్లు, ఉద్యోగులు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకంలో భాగంగా పెదపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపాడు ఐసీడీఎస్ సీడీపీవో కే విజయలక్ష్మి తెలిపారు. పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని పెదవేగి మండలం కూచింపూడి ఓసీ, కొండలరావుపాలెం ఎస్ పెదపాడు-9, బీసీ-ఈ నాయుడుగూడెం బీసీ-డీ, జాలిపూడి-2 ఓసీ, మల్కాపురం-2 బీసీఏ అభ్యర్థులకు కేటాయించినట్లు చెప్పారు. 21 ఏళ్ల నిండి 35 సంవత్సరాలు లోపు వయస్సున్న పదో తరగతి పాసైన స్థానికులైన వివాహిత మహిళలు జూన్ నెల 2లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి అటెస్టేషన్ చేసిన ధ్రువ పత్రాలను జత చేయాలన్నారు. కులం, విద్యార్హతలు, పుట్టినతేదీ, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని విజయలక్ష్మి కోరారు.


# బీసీ జన బాంధవుడు వైఎస్ జగన్

గణపవరం: బీసీల చిరకాల కోరిక అయిన బీసీ కులాల జనగణన అధ్యయనానికి కమిటీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం శుభపరిణామమని రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి అన్నారు. దీంతో వైఎస్ జగన్ బీసీ జనబాంధవుడిగా చరిత్రలో నిలుస్తారని ఆమె పేర్కొన్నారు. గణపవరంలో ఆమె శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ బీసీ విభాగాల నాయకులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీ జనగణన చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదన్నారు. జనగణన వల్ల బీసీ కులాలకు జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఆయా వర్గాలకు రావాల్సిన సమాన హక్కులు ప్రాతినిధ్యం లభించడానికి అవకాశం ఉంటుందన్నారు. సంక్షేమ పథకాల్లోనూ న్యాయమైన వాటా దక్కుతుందన్నారు. బీసీ జనగణన త్వరగా పూర్తిచేసి నివేదిక అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రొంగల శ్రీను, బీసీ నాయకులు శెట్టిరాజా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ అనంతలక్ష్మి

## రహదారిపై పచ్చని పందిరి



పినకడిమి-కొప్పాక మార్గంలో ఎండకు గొడుగు పట్టినట్టున్న పచ్చని చెట్లు,

దుగ్గిరాల వద్ద నీడనిస్తున్న వృక్షాలు →



పెదవేగి : భానుడి ప్రతాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే రోహిణి కార్తె ప్రజలను భయపెడుతోంది. మండుటెండలో ప్రయాణించే వాహనదారులు రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్టు కనిపిస్తే దాని నీడన కొద్దిసేపు సేద దీరుతుంటారు. మండంలోని దుగ్గిరాల, పినకడిమి-కొప్పాక రహదారి, స్థానిక బి శింగవరం-కొప్పాకగూడెం, పెదవేగి-కూచింపూడి రహదారికిరువైపులా పెరిగిన వృక్షాలు బాటసారులకు ఆహ్లాదాన్ని పంచి మండు వేసవిలో ఉపశమనాన్నిస్తున్నాయి. ఏళ్ల తరబడి ఉన్న వృక్షాల కొమ్మలు రోడ్డుపైకి పందిరి మాదిరిగా విస్తరించి ప్రయాణికులు ఎండబారిన పడకుండా గొడుగులా నీడనిస్తున్నాయి. రోడ్ల పక్కన పెరిగిన వృక్షాలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడడమేకాక ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో ప్రయాణించే వారు ఈ చెట్ల నీడన తమ వాహనాలను ఆపి కొద్దిసేపు చల్లదనాన్ని ఆస్వాదించి ముందుకు సాగుతున్నారు.

## భానుడి ప్రతాపం... ప్రజలు విలవిల

దెందులూరు: భానుడి ప్రతాపానికి తాళలేక ప్రజలు అల్లాడుతున్నారు. రోడ్లన్నీ ఉదయం 12 గంటలు దాటిన తర్వాత కర్ఫ్యూను తలపిస్తూ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. శనివారం ఉదయం 9 గంటల నుంచి వడగాడ్పులు, భరించలేని ఎండ, వేడితో చిన్నారులు, వృద్ధులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోహిణికార్తె కావడంతో భానుడి ప్రతాపం భరించలేని విధంగా ఉందని వ్యాపారులు, ఉద్యోగులు, ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారి, దెందులూరు మార్కెట్ సెంటర్ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూను తలపించాయి. షాపులన్నీ ఉదయం 10 గంటలకే మూతపడ్డాయి. వృద్ధులు, చిన్నారులు ఎండ వేడిమి తట్టుకోలేక చెట్ల కిందకు చేరుకుని ఉపశమనం పొందారు. అనేక మంది శీతలపానీయాలు, ముంజులు, పుచ్చకాయలు, కొనుగోలు చేసి వేసవి తాపాన్ని తీర్చుకున్నారు.



నిర్మానుష్యంగా దెందులూరు మార్కెట్ సెంటర్

## వైఎస్సార్ కంటివెలుగు పేదల జీవితాలకు వెలుగు

గణపవరం: పట్టణాలకు, నగరాలకు వెళ్లి కంటి వైద్యం చేయించుకోలేని గ్రామీణప్రాంత నిరుపేదలు, వృద్ధులకు వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం వరమని, వారి జీవితాల్లో కొత్తవెలుగులు నింపుతుందని గణపవరం మండలం కాశిపాడు సర్పంచ్ కోట నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు జంపన పద్మావతి రమేష్‌రాజు అన్నారు. కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. శనివారం గణపవరం మండలం కాశిపాడు గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా 76 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు అందిస్తామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక, గణపవరం సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికి కనీసం రెండు సార్లు ఆకుపచ్చని కూరలు తినాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిన్నం సిల్వెస్టర్‌రాజు, సొసైటీ కార్యదర్శి రామకృష్ణంరాజు, గ్రామ కార్యదర్శి రామారావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



కాశిపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

# నకిలీ పట్టాలపై చర్యలు శూన్యం

దెందులూరు : మండలంలోని పోతునూరులో తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి గ్రామ రెవెన్యూ అధికారి పట్టాలిచ్చారని ఆరోపిస్తూ పలువురు కలెక్టర్, ఆర్డీవోకు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు వేగి వీర బాపూజీ, కోటేశ్వరరావు మాట్లాడుతూ పోతునూరుకి చెందిన ఆడారి కనక వరవిజయలక్ష్మికి నాలుగు ఎకరాలకు సంబంధించిన పట్టాను పొలం లేకపోయినా తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి, గ్రామ రెవెన్యూ అధికారి నకిలీ పట్టాను అందించారని వారు ఆరోపించారు. దీనిపై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వారు శనివారం విలేకరుల సమావేశం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1996లో దెందులూరు తహసీల్దార్‌గా పనిచేసిన డి వెంకట్రావు పేరున రూపొందించిన స్టాంపును వేసి, 2006లో ఆడారి కనక విజయలక్ష్మికి అక్రమంగా పట్టా ఇచ్చారు. 2006లో పనిచేసిన దెందులూరు తహసీల్దార్ సరోజిని పేరు లేకుండా ఏ విధంగా పట్టా ఇస్తారని అధికారులకు ఫిర్యాదు చేసినా దీనిపై ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారుల స్పందించి పూర్తిస్థాయి విచారణ చేసి నకిలీ పట్టాను రద్దుచేసి, గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని వీర బాపూజీ, కోటేశ్వరరావు కోరారు. ఆరోపణలు అబద్ధమని తేలితే మాపై తీసుకునే ఏ చర్యకైనా సిద్ధమని వారన్నారు.



ఫిర్యాదు పత్రాన్ని చూపిస్తున్న వీర బాపూజీ, కోటేశ్వరరావు

## ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీ

పెదపాడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని కొక్కిరపాడు గ్రామ పంచాయతీ పరిధిలో గోళ్ల మహేష్‌కు చెందిన పంట పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగ అపహరించారు. దీంతో పెదపాడు విద్యుత్‌శాఖ ఏఈ రాంబాబు ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై బీ నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు: మండలంలో రాజుపేట అప్పనవీడు-1 గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో జనరల్ అభ్యర్థికి, తోటగూడెం గ్రామ సచివాలయ పరిధిలోని రాజుపేటలో వలంటీర్ల పోస్టులు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 10వ తరగతి పాసైన జనరల్ కేటగిరికి చెందిన వ్యక్తులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల యువతీయువకులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### 30న వలంటీర్లకు వందనం

పెదపాడు: మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. వట్లూరులోని టీటీడీసీలో ఈనెల 30న ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న గ్రామ వలంటీర్లకు ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వలంటీర్లందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

### ఆడుతూ.. పాడుతూ చిన్నారుల సందడి



ఊయల ఊగుతున్న చిన్నారులు

పెదవేగి : గ్రామాల్లో చిన్నారులు సెలవులను సంతోషంగా ఆడుతూ పాడుతూ గడుపుతున్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం, చింతలపాటివారిగూడెంలో వేపచెట్టుకు చీరతో ఉయ్యాల కట్టి ఒకరు దానిని ఊపుతుంటే మరొకరు ఊగుతూ ఆనందంగా గడిపారు. ఖాళీ వాటర్ బాటిళ్లపై తీన్‌మార్ శబ్దాలు చేస్తూ దానికి చిన్నారులు నృత్యాలు చేస్తూ కనిపించారు. చిన్నారులు పగటి వేళల్లో ఇంటిలో హౌసీ, క్యారమ్స్, వీడియో గేమ్స్ ఆడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటి ఆవరణల్లో ఇలా సందడి చేస్తున్నారు.



తీన్‌మార్ శబ్దాలు చేస్తూ నృత్యం చేస్తున్న పిల్లలు

### ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోవాలి



గణపవరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి కిరణ్మయి

గణపవరం: ప్రజల చెంతకే వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మంచి ఆశయంతో ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వినియోగించుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. శనివారం గణపవరం గ్రామ సచివాలయం- 4 పరిధిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్యసహాయకుడు యోహాన్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### వీరేశలింగం సేవలు వెలకట్టలేం

ఏలూరు రూరల్: సమాజంలో దురాచారాలను రూపుమాపుడానికి కందుకూరి వీరేశలింగం పంతులు అలుపెరగని పోరాటం చేసారని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. శనివారం స్థానిక పవర్‌పేటలోని సీపీఎం కార్యాలయంలో వీరేశలింగం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహరావు, బి.సోమయ్య, ఎ.శ్యామలారాణి తదితరులు విరేశలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# నీతి కథల ద్వారా జీవిత పాఠాలు



పోతునూరు గ్రంథాలయంలో విద్యార్థులతో క్యారమ్స్‌లో శిక్షణనిస్తున్న గ్రంథాలయ అధికారి జాన్‌బాబు



పెదవేగి గ్రంథాలయంలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

భీమడోలు: జీవితంలో నేర్చని పాఠాలను నీతి కథల ద్వారా తెలుసుకోవచ్చునని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం చిన్నారులకు వివిధ అంశాలపై శిక్షణ అందించారు. మండే సుధాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పంచతంత్ర కథలు, నైతిక విలువల గల కథలు చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు గ్రంథాలయాలు వేదికలుగా మారాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి రోజు గ్రంథాలయాలకు పంపాలన్నారు. పుస్తక పఠనాసక్తిని పెంచడమే గ్రంథాలయాల లక్ష్యమన్నారు. తొలుత నీతి కథలు వివరించారు. పుస్తక సమీక్షలు రాసారు. పలు విద్యా విషయక అంశాలను మండే సుధాకర్ తెలిపారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎన్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో యోగా నిపుణుడు కురెళ్ల కిషోర్ యోగాసనాలపై శిక్షణ అందించారు. గుండుగొలను గ్రంథపాలకుడు జి.నాగమణి ఆధ్వర్యంలో చిన్నారులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గేదెల ఈశ్వరమ్మ, రిసోర్స్‌పర్సన్ ఈతకోట భవ్యశ్రీ, పాఠకులు, సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

**గ్రంథాలయంలో వేసవి తరగతులు**

దెందులూరు : వేసవి విజ్ఞాన శిబిరాన్ని దెందులూరు గ్రంథాలయంలో శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బి జానుబాబు విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, నీతి కథలు చదివించారు. కంప్యూటర్ వినియోగంపై, పత్రిక పఠనంపై అవగాహన కల్పించారు. క్యారమ్స్ పోటీ నిర్వహించారు.

**విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ**

పెదవేగి : విద్యార్థి దశ నుంచే విజ్ఞానంతోపాటు ఆరోగ్యం కూడా చాలా ప్రాముఖ్యమని గార్లమడుగు ఓరియంటల్ హైస్కూల్ పీఈటీ ఆదినారాయణ అన్నారు. పెదవేగి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా 20వ రోజు శనివారం ప్రత్యేక యోగా శిక్షణ తరగతులు సందడిగా సాగింది. పెదవేగి గ్రంథపాలకుడు తోట అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పీఈటీ ఆదినారాయణ యోగాలో ప్రాణాయమాలు, సూర్యనమస్కారాలు వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, ఆసనాలు వేయించారు. ఈ శిక్షణ శిబిరంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.